క్లుప్తంగా

వైభవంగా నేస్తాలమ్మ పండగ


నేస్తాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల ఆరాధ్య దైవం నేస్తాలమ్మ పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి డప్పువాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, కోయడ్యాన్సుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అప్పన్న సన్నిధిలో త్రిలోకచంద్ర


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న త్రిలోకచంద్ర

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కర్ణాటక సీఎం సెక్రటరీ త్రిలోకచంద్ర(ఐఏఎస్) గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందజేశారు.

పోరాట యోధుడు చేగువేరా


చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన మహోన్నత వ్యక్తి ప్రపంచ కమ్యూనిస్ట్ నేత చేగువేరాయేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిసెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో చేగువేరా 57వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతర ఆయన మాట్లాడుతూ నేటి యువత చేగువేరాను ఆదర్శంగా తీసుకోని ప్రజా సమస్యలపై పోరాటం సాగించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మతోన్మాదానికి, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన వ్యక్తి చేగువేరా అని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, టి.మల్లేశ్వరరావు, దేవ కిషోర్, రాంబాబు, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌కు చెందిన సామాజిక సేవా కార్యకర్త, చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు పలువురు చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మల్కాపురంలో గురువారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ నెల రోజుల పాటు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని, చిన్నారులు వైట్ పేపర్లు, రంగు పెన్సిళ్లు, కలర్స్, ప్యాడ్ వెంట తెచ్చుకోవాలన్నారు. చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పి, వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తానని చెప్పారు.

దసరా.. సం‘భారం’

దసరా.. పిల్లలకు సెలవులతో ఇంట్లో.. కొనుగోలుదార్లతో మార్కెట్లో సందడే సందడి. ఆరునూరైనా పండగ వేళ కొత్త వస్త్రాలు, స్వీట్లు తప్పనిసరి. దీనికి తోడు పొట్టేలు, నాటుకోడి మాంసానికి మరీ గిరాకీ. కొత్త వాహనాలు కొనాలనుకునేవారికి దసరా ఆఫర్లకు మించిన మంచి తరుణం లేదు. దీంతో నియోజకవర్గంలో షోరూంలు, వస్త్ర, బంగారు, స్వీట్ షాపులు కళకళలాడుతున్నాయి.


సబ్బవరం మండలం గుల్లేపల్లి గురువారం సంతలో అమ్మకానికి నాటుకోళ్లు

- ప్రారంభమైన విజయదశమి సంబరాలు
- కొత్తవాహనాలు, కోళ్లు, పొట్టేళ్ల కొనుగోళ్లు
- దసరా శోభతో కిటకిటలాడుతున్న మార్కెట్లు
- రూ.6 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు అంచనా
- ధరాభారంతో పేద, మధ్యతరగతికి పండగ ‘ప్రియం’

పెందుర్తి: అమ్మలగన్న అమ్మ దుర్గమ్మకు ప్రీతికరమైన విజయదశమి వేడుకలకు నియోజకవర్గం సిద్ధమైంది. దసరా పండగ కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు గురువారం నుంచి సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు. పండగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో ప్రధాన కూడళ్లు సందడిగా మారాయి. అయితే విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలతో పేదలకు, మధ్యతరగతి ప్రజలకు పండగ భారంగా మారింది.

భారీగా పొట్టేళ్ల దిగుమతి

దసరా సంబరాల్లో జంతు బలి తప్పనిసరి. ఈ ఏడాది పెందుర్తి ప్రాంతానికి వేల సంఖ్యలో పొట్టేళ్లు, మేకలు వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యాయి. ఒక్కో పొట్టేలు పరిమాణం ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ధర పలికింది. మేకను రూ.8 వేలు నుంచి రూ.12 వేలు మధ్య ఎక్కువగా కొనుగోలు చేశారు.

నాటు కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. కనీసం రెండు కిలోలు తూగే నాటుకోడి సగటున రూ.2 వేలకు పైనే పలికింది. సబ్బవరం మండలం గుల్లేపల్లిలో గురువారం సంత సందర్భంగా వందలాది నాటు కోళ్ల విక్రయాలు జరిగాయి.


ఓ ఇంటి దగ్గర కొనుగోలు చేసిన పొట్టేళ్లు

తీపితో వేడుక ఆరంభం

దసరా సంబరాల్లో మిఠాయిలది ప్రత్యేక స్థానం. స్నేహితులకి, బంధువులకు అందించేందుకు రకరకాల మిఠాయిలు కొనుగోలు చేస్తుంటారు. పెందుర్తి ప్రాంతంలో పలు స్వీట్స్ దుకాణాలు పండగ సందర్భంగా ప్రత్యేక వంటకాలతో వినియోగదారులకు స్వాగతం చెప్తున్నాయి. పలు సంస్థల్లో ఉద్యోగులకు పండగ కానుకలు ఇచ్చేందుకు వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా కనిపించాయి. ఎలక్ట్రానిక్,, మోటార్‌సైకిళ్లు, వస్త్ర, బంగారు దుకాణాల్లో దాదాపు రూ.5 కోట్ల మేర అమ్మకాలు జరిగినట్లు వ్యాపార వర్గాల అంచనా.

వాహన పూజకు సన్నద్ధం

ఇప్పటికే కంపెనీల్లో దసరా సంబరాలు ముగిశాయి. నియోజకవర్గంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా పరిశ్రమల్లో ఆయుధ పూజ నిర్వహించి ఉద్యోగులకు సెలవులు ప్రకటించారు. ఇక దసరా నాడు వాహనాలకు పూజ చేయడం సంప్రదాయం.


పెందుర్తిలోని ఓ స్వీట్ షాపులో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న మిఠాయిలు

ధరల మోత

అమ్మవారి పటం	రూ.50-100
దిష్టి సామగ్రి	రూ.60-80
యాపిల్(కిలో)	రూ.250-300
బత్తాయి(డజను)	రూ.100-150

(షోరూంలలో కొన్ని మోడళ్ల బైక్‌లు, కార్లపై దసరా డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని అదనపు వసూళ్లు చేస్తున్నారు)

లారీలు, బస్సులు, ఆటోలు, మోటారుసైకిళ్లు, ఇతర వాహనాలతో పెందుర్తి, చినముషిడివాడ, పురుషోత్తపురం, వేపగుంట తదితర ప్రాంతాల్లో వాటర్ సర్వీసింగ్ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. శనివారం దుర్గమ్మకు, వాహనాలకు పూజలు చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

ధరల బాదుడు అన్యాయం



దసరా వస్తోందంటే.. ఓవైపు ఆనందం, మరోవైపు దిగులు. ఈ ఏడాది అన్ని సరకుల ధరలూ భారీగా పెరిగిపోయాయి. పూజాసామగ్రి ధరల గురించి చెప్పాల్సిన పన్లేదు. సాధారణ రోజుల్లో రూ.200కు విక్రయించే చామంతులు ఇప్పుడు రూ.500-600 మధ్య విక్రయిస్తున్నారు. మూడు నిమ్మకాయలతో ఉండే దండ రూ.30 చెప్తున్నారు. దసరా పేరిట ధరల బాదుడు మాత్రం అన్యాయం.

– బొట్ట కృష్ణ, చీమలాపల్లి

ఆర్డర్లతో బిజీ



దసరా పండగ సందర్భంగా వివిధ సంస్థలు, కార్యాలయాల నుంచి భారీ ఆర్డర్లు వచ్చాయి. గత వారం నుంచి హడావుడి మొదలయింది. ప్రీ బుకింగ్‌లతో స్వీట్స్ దుకాణాలు బిజీగా ఉన్నాయి. పండగను ప్రజలంతా ఆనందగా చేసుకునేందుకు మా వంతుగా నాణ్యమైన స్వీట్స్‌ను తయారు చేసి అందిస్తున్నాం. చాలా మంది మిక్స్‌డ్ స్వీట్స్ ప్యాకెట్లనే ఆర్డర్ చేస్తున్నారు.

– నూలు గణేష్, అంబికా స్వీట్స్ అధినేత

అప్పన్నకు స్వర్ణపుష్పార్చన


స్వర్ణపుష్పాలకు నమస్కరిస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. అర్చకులు చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాయపురఅగ్రహారం శ్రీకృష్ణుడి ఆలయ హుండీ చోరీ


సీసీ కెమెరాలో చోరీ నిందితుడు


తుప్పల్లో వదిలేసిన ఖాళీ హుండీ

- రూ.40 వేల వరకు అపహరించినట్లు అంచనా

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణమందిరంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీని అపహరించుకుపోయారు. ఎత్తుకుపోయిన హుండీలో నుంచి సొమ్మును కాజేసి, ఖాళీ హుండీని ఆలయ సమీపంలోని తుప్పల్లో వదిలేశారు. పోలీసులు తెలిపిన వివరాలు. గురువారం ఉదయం అర్చకులు నిత్యపూజల నిమిత్తం ఆలయం తలుపులు తెఱచారు. ఆలయంలో ఉండాల్సిన హుండీ కనిపించకపోవడంతో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుకు సమాచారమిచ్చారు. సర్పంచ్ ఆలయం వద్దకు చేరుకుని, పరిసరాలను పరిశీలించారు. సమీపంలోని తుప్పల్లో ఖాళీ హుండీ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సీసీ కెమెరాల ఫుటేజీ సాయంతో విచారణ ప్రారంభించారు. మాస్క్ ధరించిన వ్యక్తి హుండీని ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. సుమారు రూ.40 వేలు వరకు హుండీలో కానుకల రూపంలో వచ్చిన నగదు ఉండవచ్చని పోలీసులకు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.

మంద కృష్ణ మాదిగ అరెస్ట్ అన్యాయం


నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: డీఎస్సీ నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వ తీరును నిరసిస్తూ హైదరాబాద్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న మంద కృష్ణమాదిగను అరెస్ట్ చేయడం అన్యాయమని జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకుడు గొటివాడ సామ్రాట్‌కుమార్ ఆక్షేపించారు. ఈ మేరకు సబ్బవరంలో గురువారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇండుగుబిల్లి గోపి, బొర్రా జయరాజు, నీటిపల్లి గౌరి, మారేడుపూడి కోటి, దువ్వి దుర్గాలు, జోరీగల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సహచరుల ఆర్థిక సాయం


హోంగార్డు భార్య కనకమహాలక్ష్మికి చెక్ అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: అనకాపల్లి ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు పాట్నూరి రవికుమార్ కుటుంబాన్ని సహచరులు ఆర్థికంగా ఆదుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.4,10,695లను చెక్కు రూపంలో మృతుడి భార్య కనకమహాలక్ష్మికి ఎస్పీ ఎం.దీపిక గురువారం అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు విధి నిర్వహణలో మరణించినా, పదవి విరమణ చేసినా.. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఒకరోజు వేతనాన్ని సహచర హోంగార్డులు అందించడం అభినందనీయమన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన


స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు ప్రదేశాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా

సింహాచలం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ నుంచి అడవివరంలోని పాత గోశాల జంక్షన్ వరకు ప్రధాన రహదారిలో ఎనిమిది చోట్ల స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకి సంబంధించి 98వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, జీవీఎంసీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ మార్గంలో వాహనాల స్పీడ్ ఎక్కువగా ఉండటంతో, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఇటీవల జీవీఎంసీ కౌన్సిల్ దృష్టికి కార్పొరేటర్ తీసుకెళ్లారు. దీంతో బాలాజీనగర్, లక్ష్మీనరసింహనగర్, విరాట్‌నగర్, మారుతీనగర్, ప్రహ్లాదపురంలోని శివాలయం, శ్రీనివాసనగర్, గణేష్‌కాలనీ, పాత గోశాల జంక్షన్ వద్ద స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై అధికారులతో కలిసి పరిశీలించడంతోపాటు, పనులు కూడా ప్రారంభించారు.

పాలయమాం దుర్గా

ఈ లోకంలో ప్రతి జీవకోటి దుర్గా స్వరూపమే. సమస్త లోకాలూ ఆమె ప్రతిరూపాలే. ఈ విశ్వంలో దుర్గాస్వరూపం కానిదేదీ లేదని ఆ తల్లిని నమ్ముకున్న భక్తుల భావన. నమ్మి కొలిచిన వారి దుర్గతులను దూరం చేసే చల్లని తల్లిగా దుర్గమ్మ రూపంలో అమ్మవారిని కొలిచి, భక్తులు తరించారు. పలు చోట్ల ధనలక్ష్మి, లలితా త్రిపుర సుందరి అలంకరణలో పూజించారు. భారీ అన్నసమారాధనలు జరిపారు.


సప్తగిరినగర్‌లో ధనలక్ష్మిగా అలివేలు మంగమ్మ


పెందుర్తి మండలం కోట్నీవానిపాలెంలో దీపారాధన

- దుర్గాష్టమి సందర్భంగా ఊరూవాడా ప్రత్యేక పూజలు
- దుర్గ, ధనలక్ష్మి, లలితా త్రిపురసుందరి అలంకరణ


పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో దుర్గాదేవిగా..


మహిషాసుర మర్దినిగా వేద గాయత్రి


ఎస్ఆర్ పురంలో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ


బొంకులదిబ్బ వద్ద వడ్డన చేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు


సుజాతనగర్లో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు


దేవీపురంలో కుమారి పూజలో చిన్నారులు


వెదుళ్లనరవలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో పవిత్రమైన దుర్గాష్టమిని పురస్కరించుకుని ఎనిమిదో రోజు గురువారం అమ్మవార్ల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు పూజలందుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. తొలుత అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. ధనలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి, కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు, విశేష అర్చనలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. వెంకటమహేష్, బ్రాహ్మణి దంపతులు రూ.1.10 లక్షలతో చేయించిన బంగారు పుస్తెలతాడును అమ్మవారికి సమర్పించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని లక్ష్మీనరసమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. దాదాపు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆర్‌కే ఫంక్షన్ హాల్ అధినేత కృష్ణారెడ్డి, టీడీపీ నేత శానాపతి శంకరరావు, ఆటో యూనియన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరంలోని హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహలక్ష్మీ నృసింహ ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు, పరిసర గ్రామాల క్షపజలు తరలివచ్చి, దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- నాయుడుతోటలోని వేద గాయత్రి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చింది. భక్తులు అశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ ప్రాంతంలో బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన అన్న సమారాధనను పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు ప్రారంభించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, గెడ్డం ఉమ, చల్లా కనకారావు, పైల పోతినాయుడు, పైల రామచంద్రరావు, వర్రి పైడం నాయుడు పాల్గొన్నారు.

- మండలంలో ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగపాలెంలో అమ్మవారిని పరిసర గ్రామాల భక్తులు దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఎస్ఎంపీ యూత్, భవానీ భక్తుల పీఠం సంయుక్త ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

సబ్బవరం: మండలం కేంద్రం సబ్బవరంలో శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సీఐ పిన్నంటి రమణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు.

- బంగారమ్మపాలెంలో భవానీ మాలధారణ భక్తులు 108 ఘటాలతో పంచామృతాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ముత్యాలమ్మ వారికి సమర్పించారు. సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దాడి కన్నం నాయుడు, దొడ్డి ప్రకాష్ పాల్గొన్నారు.
- దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో నిర్వహించిన దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కుమారి పూజలు నిర్వహించారు. 100 మంది చిన్నారులకు పూజలు జరిపి, వివిధ కానుకలు అందించారు.
- మండలంలోని వెదుళ్లనరవలో వేంచేసిన శ్రీ కంచి శక్తిపీఠాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నేతలు కర్రిబాబు, కొటాన రాము, చొప్పా నాగరాజు, బోరయ్య, దాడి నూకరాజు, వడ్డాది అప్పలరాజు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు, కాపుశెట్టి శేషుబాబు, చిరికి దేముడు, సీహెచ్ తాతారావు, బొట్టా ముత్యాలరావు, పల్లా చిన్నారావు, చట్టి అప్పలరాజు, బొట్టా అప్పలరాజు, వినయ్ ఉన్నారు.

మహాకాళిగా రాజశ్యామల


మహాకాళి అవతారంలోని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీలు

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని శారదాపీఠంలో ఎనిమిదో రోజు మహాకాళిగా శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల చేతుల మీదుగా అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమార్చన, సువాసిని పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి స్వామీజీ చేతుల మీదుగా ఏకాదశ హారతులు అందించారు.